భారత్ సమాచార్.నెట్
BHARATH SAMACHAR DIGITAL

11, సెప్టెంబర్ 2026, శుక్రవారం భారత్ సమాచార్

వెలిశాల ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసిన సర్పంచ్



భారత్ సమాచార్, సూర్యాపేట జిల్లా: తిరుమలగిరి మండలం వెలిశాల క్రాస్ రోడ్డులోని ప్రాథమిక పాఠశాలను గ్రామ సర్పంచ్ కుంభం మంజుల సతీష్ గౌడ్, గ్రామపంచాయతీ కార్యదర్శి అరుణ్‌తో కలిసి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యా బోధన, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య నిర్వహణ, పాఠశాల పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. పాఠశాలలోని మౌలిక వసతుల పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అనంతరం సర్పంచ్ విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి చదువు, పాఠశాలలో ఎదురవుతున్న సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరవుతూ చదువుపై దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు పాఠశాలలో పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ కుంభం మంజుల సతీష్ గౌడ్ మాట్లాడుతూ పిల్లలే గ్రామ భవిష్యత్తుకు బలమైన పునాది అని అన్నారు. ప్రతి విద్యార్థికి మంచి విద్య, సురక్షితమైన వాతావరణం, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే గ్రామపంచాయతీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు గ్రామపంచాయతీ తరపున అన్ని విధాలుగా సహకరిస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారు. పాఠశాలల్లో విద్యతో పాటు పరిశుభ్రత, తాగునీరు, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన అంశాలను గుర్తించి దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

© 2026 Bharath Samachar